సాక్షి
కుమురం భీం

శనివారం । 21 । అక్టోబర్ । 2023



జనసంద్రమైన అమ్మ పుణ్యక్షేత్రం
మహారాజ్‌గూడ అడవుల్లోని జంగుబాయి పుణ్యక్షేత్రం జనసంద్రంగా మారింది. అమ్మ వారి సన్నిధిలో ముందస్తు దసరా ఉత్సవాలు నిర్వహించారు. 2లో▸

దుర్గామాతకు పూజలు
నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. కనకదుర్గాదేవి, స్వయంభూ మహం కాళి ఆలయంలో అమ్మవారు సరస్వతీ దేవి అవతారంలో దర్శనమిచ్చారు. 3లో▸



గరిష్టం/కనిష్టం
33.6 /20.1

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా ఎక్కువగా నమోదవుతాయి. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. మంచు కురుస్తుంది. చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మొద్దు'



ప్రచారం చేస్తున్న కోవ లక్ష్మి, ఆత్రం సక్కు

కెరమెరి(ఆసిఫాబాద్): కాంగ్రెస్, బీజేపీ అధికారంలోకి వస్తే తెలంగాణ రాష్ట్రాన్ని ఢిల్లీకి తాకట్టు పెడతారని, వారి మాటలు నమ్మొద్దని జెడ్పీ చైర్‌పర్సన్, బీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి అన్నారు. మండలంలోని జోడేఘాట్, చిన్నపాట్నాపూర్, పెద్దపాట్నాపూర్, బాబేఝురి, కొలాంగూడ, గోండ్‌గూడ, పాటగూడ, లైన్‌పటార్, టోకెన్‌మోవాడ్, పిట్టగూడ గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోవ లక్ష్మి మాట్లాడుతూ 40 ఏళ్లుగా సాధించని అభివృద్ధిని పదేళ్లలో సాధించామన్నారు. పోడు భూములకు పట్టాలిచ్చి, రైతుబంధు అందించిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. అంతకుముందు జోడేఘాట్‌లో కుమురం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెందోర్ మోతీరాం, జెడ్పీటీసీ దుర్పత బాయి తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

కౌటాల(సిర్పూర్): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే బీఆర్‌ఎస్ పార్టీ లక్ష్యమని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. కౌటాల మండల కేంద్రంలోని ఆయన నివాసంలో చింతలమానెపల్లి మండలం రణవెల్లి, దిందా, కర్జెల్లికి చెందిన పలువురు శుక్రవారం పార్టీలో చేరగా, వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. చింతలమానెపల్లి ఎంపీపీ నాన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

'పాల్వాయి'పై కేసు

దహెగాం(సిర్పూర్): బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబుపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు నమోదు చేసినట్లు శుక్రవారం ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. దహెగాం మండలం కోత్మీర్‌లో గురువారం రిటర్నింగ్ ఆఫీసర్ అనుమతి లేకుండానే బీజేపీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారని పేర్కొన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ఫిర్యాదు చేయడంతో హరీశ్‌బాబుపై కోడ్ ఉల్లంఘన కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

తిర్యాణి(ఆసిఫాబాద్): రైతులు పంటల సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు అన్నారు. తిర్యాణి మండలం గంభీరావుపేటలో శుక్రవారం భారతీయ వరి పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా మందుల పిచికారీ ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంటలకు డ్రోన్ ద్వారా ఎకరానికి ఆరు నిమిషాల్లో మందు పిచికారీ చేయొచ్చన్నారు. ఏవో తిరుమలేశ్వర్, ఏఈవోలు సాగర్, ఆదిత్య, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణాపై సమాచారం ఇవ్వండి

ఆసిఫాబాద్‌అర్బన్: మద్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారం ఇవ్వాలని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారి జ్యోతికిరణ్ శుక్రవారం తెలిపారు. జిల్లా ఎక్సైజ్ అధికారి 08733- 293933, కాగజ్‌నగర్ ఎక్సైజ్ కార్యాలయం 87126 58784, ఆసిఫాబాద్ ఎక్సైజ్ కార్యాలయం 87126 58783 నంబర్లకు ఫిర్యాదులు, సమాచారం అందించవచ్చని పేర్కొన్నారు.

నగదు పాట్లు!



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు వైన సరిత. రెబ్బెన మండలం జక్కులపల్లి గ్రామం. ఈ నెల 11 బెల్లంపల్లిలోని ఓ జువెల్లరీ షాపులో తులం బంగారు గొలుసు ఆర్డర్ చేసింది. 15వ తేదీన ఆభరణం తెచ్చుకునేందుకు ఆర్టీసీ బస్సులో బయలుదేరింది. అయితే రెబ్బెన మండలం గోలేటి వద్ద అధికారులు తనిఖీలు చేపట్టి ఆమె వద్ద ఉన్న రూ.60,900 నగదును స్వాధీనం చేసుకున్నారు. బంగారం కొనుగోలుకు సంబంధించిన పత్రాలు చూపినా డబ్బులు తీసుకున్నారని బాధిత మహిళ ఆరోపించింది.



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు చింతలమానెపల్లి మండలం రుద్రాపూర్‌కు చెందిన నందిపేట రాకేశ్. అతడి పొలంలో పండిన వడ్లను బెల్లంపల్లిలో విక్రయించగా రూ.92వేలు వచ్చాయి. డబ్బులు తీసుకుని వ్యానులో వస్తుండగా కాగజ్‌నగర్ పట్టణంలోని వినయ్‌గార్డెన్ వద్ద పోలీసులు తనిఖీ చేశారు. ఆధారాలు లేవంటూ డబ్బు సీజ్ చేశారు.



వాంకిడి మండలంలో నగదు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు (ఫైల్)

మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు చెందిన సంధ్య కుటుంబ సభ్యులతో వేములవాడ రాజేశ్వరస్వామి దర్శించుకునేందుకు బయలుదేరారు. వేములవాడలోనే కూతురు పెళ్లి బట్టలకు షాపింగ్ చేయాలని రూ.1.50 లక్షలు నగదుతో వెంట ఉంచుకున్నారు. జిల్లాలో ప్రవేశించగానే పోలీసులు తనిఖీ చేసి నగదును స్వాధీనం చేసుకున్నారు.

జిల్లా కేంద్రంలోని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీకి సంబంధించి వాంకిడి నుంచి ఆసిఫాబాద్‌కు సిలిండర్లు విక్రయించిన డబ్బులతో వస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఏజెన్సీ బాయ్ నుంచి 104 సిలిండర్లు విక్రయించిన రూ.1,02,320 నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఓ చిట్‌ఫండ్‌కు సంబంధించిన రూ.2.60 లక్షలను సైతం స్వాధీనం చేసుకున్నారు. ఇలా జిల్లాలో ఎన్నికల కోడ్‌పై సరైన అవగాహన లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. అత్యవసరంలో తీసుకెళ్తున్న డబ్బులతో పోలీసులకు పట్టుబడుతున్నారు.

- ఎన్నికల తనిఖీల్లో పట్టుబడుతున్న నగదు
- పండుగ పూట పెరిగిన నగదు లావాదేవీలు
- చిరువ్యాపారులు, సామాన్యులకు తప్పని తిప్పలు

ఆసిఫాబాద్: ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత జిల్లా యంత్రాంగం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై దృష్టి సారించింది. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అధికారుల నిఘా పెరిగింది. నగదు, మద్యం అక్రమ రవాణాతోపాటు ఓటర్లను ప్రలోభ పెట్టే ఉచితాలపై దృష్టి కేంద్రీకరించారు. ఈ క్రమంలో సొంత అవసరాలకు నగదు తీసుకెళ్తున్న సామాన్య ప్రజలకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు. అవగాహన లేక చాలామంది పండుగకు ముందు తిప్పలు పడుతున్నారు. పోలీసులు స్వాధీనం చేసుకుంటున్న డబ్బులో చాలా వరకు ఇలాంటి కేసులే అధికంగా ఉంటున్నాయని తెలుస్తోంది.

ఎనిమిది చెక్‌పోస్టులు
ఎన్నికల్లో అక్రమాలు నివారించేందుకు ఎనిమిది అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పోలీసులు నిత్యం తనిఖీలు చేపడుతున్నారు. రూ.50 వేల కంటే అధికంగా నగదు ఉంటే సరైన పత్రాలు చూపించాలి. లేని పక్షంలో పోలీసులు నగదు స్వాధీనం చేసుకుంటున్నారు. ఇప్పటివరకు జిల్లాలో సరైన ఆధారాలు లేకుండా తరలిస్తున్న 44 మంది నుంచి రూ.1,50,45,086 నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే రూ.3,97,528 విలువైన 690 లీటర్ల మద్యం, 182 మొబైల్ ఫోన్లు పట్టుకున్నారు.

పత్రాలు చూపాల్సిందే
తనిఖీల్లో పోలీసులు పట్టుకున్న నగదు తిరిగి పొందేందుకు అవసరమైన పత్రాలు చూపాల్సి ఉంటుంది. పత్రాలు లేకుంటే నగదును జిల్లా కేంద్రంలోని ట్రెజరీకి తరలిస్తారు. డబ్బులు తిరిగి పొందేందుకు బాధితులు పత్రాలతో ట్రెజరీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. పత్రాలను ధ్రువీకరించిన అనంతరం డీటీవో రిలీజ్ ఆర్డర్ అందజేస్తారు. జిల్లాలో ఇప్పటివరకు 44 మంది నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. సరైన పత్రాలు సమర్పించిన ఐదుగురికి నగదును తిరిగి చెల్లించారు.

అవగాహన లేకనే..!
ఎన్నికల నిబంధనలపై ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో రాష్ట్రవ్యాప్తంగా కోడ్ అమల్లోకి వచ్చింది. జిల్లాలో ప్రతిరోజూ వివిధ రకాల వ్యాపారాలతో నిత్యావసర వస్తువులు, కిరాణం, జువెల్లరీ, వస్త్రాలు, రెడీమేడ్, ఫర్టిలైజర్, పండ్లు, కూరగాయలు, మెడికల్ తోపాటు ఇతర రంగాలకు సంబంధించి రూ.లక్షల్లో లావాదేవీలు జరుగుతుంటాయి. బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ఈ వ్యాపారాలు మరింత ఊపందుకున్నాయి. డిజిటల్‌తోపాటు నగదు లావాదేవీలు అధికంగా జరుగుతున్నాయి. చిరువ్యాపారులు, రైతులు, వివాహాలు, వైద్యం తోపాటు ఇతర అత్యవసర పరిస్థితుల్లో నగదు తీసుకెళ్తున్న వారు అధికారుల తనిఖీల్లో పట్టుబడుతున్నారు. మళ్లీ నగదు కోసం జిల్లా కేంద్రంలోని ట్రెజరీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

సిలిండర్ల నగదు పట్టుకున్నారు



కాగజ్‌నగర్ నుంచి రెబ్బెనకు వంటగ్యాస్ సిలిండర్లు వ్యాన్‌లో సరఫరా చేస్తా. ఈ నెల 1న రెబ్బెన నుంచి కాగజ్‌నగర్‌కు తిరిగి వస్తుండగా వంజీరి చెక్‌పోస్టు వద్ద అధికారులు తనిఖీ చేశారు. గ్యాస్ ఏజెన్సీ ఐడీ కార్డు చూపించా. సిలిండర్లు విక్రయించిన నగదు రూ.64,200 స్వాధీనం చేసుకున్నారు.
– మీర్జా నదీం బేగ్, గ్యాస్ ఏజెన్సీ వర్కర్, కాగజ్‌నగర్

'గెలుపు'నకు బాధ్యతలు !



భైంసాలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి పురాణం, పక్కన ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



లక్సెట్టిపేటలో మాట్లాడుతున్న మంచిర్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి భానుప్రసాద్‌రావు

- నియోజకవర్గ ఇన్చార్జీలుగా సీనియర్లు
- ఎన్నికలు ముగిసే వరకు అక్కడే మకాం
- బీఆర్‌ఎస్‌లో సమన్వయం చేస్తున్న బాధ్యులు
- అభ్యర్థుల కోసం కష్టపడుతున్న నాయకులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఎన్నికల నియోజకవర్గ ఇన్చార్జీలు తమ కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అవసరమైన చోట ఈ ఎన్నికల ప్రచారాన్ని సీనియర్లకు అప్పగించారు. వీరంతా పోలింగ్ ముందు వరకు అక్కడే మకాం వేసి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాల్సి ఉంటుంది. అసంతృప్తులుగా ఉన్న వారికే వ్యూహాత్మకంగా గెలుపు బాధ్యతలు కట్టబెట్టారు. మంచిర్యాల, ఖానాపూర్, బెల్లంపల్లి, బోథ్, ముధోల్ నియోజకవర్గాల్లో సమన్వయ బాధ్యతలను మాజీ ఎంపీ గోడం నగేశ్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద్‌రెడ్డి, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎంపీ వెంకటేశ్‌నేత, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావుల భుజానికెత్తారు.

ముధోల్‌లో 'పురాణం'
ముధోల్ నియోజకవర్గంలో ఉమ్మడి జిల్లాలో సీనియర్‌గా ఉన్న మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కుమార్ మూడు రోజుల క్రితమే తన కార్యాచరణ ప్రారంభించారు. పార్టీలో అసంతృప్తులు, కార్యకర్తలను సమన్వయం చేస్తున్నారు. ఎన్నికల సందర్భంగా ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని గెలిపించాలని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో రెండు సార్లు గెలిచిన సిట్టింగ్ ఎమ్మెల్యేపై ఉన్న వ్యతిరేకత, ప్రతిపక్ష నాయకుల పోటీని తట్టుకుని గెలిపించాల్సిన బాధ్యత 'పురాణం'పై పడింది.

ఖానాపూర్‌కు దండే విఠల్
ఎమ్మెల్సీ దండే విఠల్ ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో పార్టీ ఆదేశాల మేరకు క్రియాశీలకంగా పని చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఖానాపూర్ నియోజకవర్గ ఎన్నికలకు పార్టీ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఇక్కడ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ స్నేహితుడు భూక్య జాన్సన్‌నాయక్ బరిలో ఉండడంతో మరింత ప్రాధాన్యత ఏర్పడింది. జాన్సన్ నాయక్ తొలిసారిగా ఎన్నికల బరిలో నిలిచిన తరుణంలో పార్టీలో సీనియర్‌గా ఉన్న విఠల్ సహకరిస్తున్నారు. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్ పార్టీని వీడడంతో కేడర్‌లో కొంత ఇబ్బంది ఏర్పడింది. ఈ క్రమంలో ఇన్చార్జిగా ఉన్న ఆయన పార్టీలో పట్టు కోల్పోకుండా కాపాడే ప్రయత్నం చేస్తున్నారు.

బెల్లంపల్లిలో ఎంపీ వెంకటేశ్ నేత
బెల్లంపల్లిలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య నువ్వా నేనా అన్నట్లుగా సాగుతున్న తరుణంలో మరోసారి బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యను గెలిపించేందుకు ఇన్‌చార్జిగా పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేతకు బాధ్యతలు అప్పగించారు. ఆయన నియోజకవర్గంలో ప్రచార పని మొదలుపెట్టారు. ఎంపీ నేతకాని సామాజికవర్గంతోపాటు ప్రస్తుతం తన లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్ కావడంతో కార్యకర్తలు, నాయకులను సమన్వయం చేస్తున్నారు.

బోథ్‌లో మాజీ ఎంపీ
బోథ్ నియోజకవర్గంలో మాజీ ఎంపీ గోడం నగేశ్ ఇన్చార్జిగా ఉన్నారు. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే బాపురావు కాంగ్రెస్‌లోకి వెళ్తున్న నేపథ్యంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి అనిల్‌జాదవ్ గెలుపు కోసం పని చేస్తున్నారు. పార్టీ సమావేశాలు, సభల్లో నగేశ్ క్రియాశీలకంగా పని చేస్తున్నారు. అనిల్ లంబాడా, నగేశ్ ఆదివాసీ కావడంతో రెండు వర్గాల్లోనూ సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నారు. బీఆర్‌ఎస్ నుంచి తొలిసారిగా, గతంలో రెండుసార్లు ఎన్నికలను ఎదుర్కొన్న అనిల్‌కు నగేశ్ వంటి సీనియర్ నాయకులు ఎన్నికల్లో కలసి వస్తుందని పార్టీ అంచనా వేసింది.

మంచిర్యాలలో ఎమ్మెల్సీ
మంచిర్యాల నియోజకవర్గంలో ఎమ్మెల్సీ భానుప్రసాదరావుకు బాధ్యతలు అప్పగించారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పోటాపోటీ హోరు నడుస్తున్న క్రమంలో సిట్టింగ్ ఎమ్మెల్యే దివాకర్‌రావు గెలుపు కోసం పని చేయడం ప్రారంభించారు. ఆయనతోపాటు మొదట అసంతృప్త నాయకుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద్‌రెడ్డి సైతం ఎమ్మెల్యే కోసం నియోజకవర్గంలో పని చేస్తున్నారు.

మళ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థులే గెలుపు

సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే మా బలం. ఎన్నికల్లో ఇవే ప్రజలకు వివరిస్తాం. పార్టీ లో అసంతృప్తి అనేది ఒక కుటుంబంలో వచ్చే త గాదా. రాను రాను అన్నీ సర్దుకుపోతాయి. నియోజకవర్గ బాధ్యులుగా ఇటు పార్టీ, అటు ఓటర్లను సమన్వయం చేస్తున్నాం. ఉమ్మడి జిల్లాలో మళ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థులే గెలుస్తారనే నమ్మకం ఉంది.
– పురాణం సతీశ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ, ముథోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి

సమన్వయం చేస్తున్నాం

పార్టీ ఆదేశాల మేరకు ఖానాపూర్ నియోజకవర్గంలో ఎన్నికల సమయంలో పార్టీ కార్యకర్తలు, నాయకులను సమన్వయం చేస్తున్నాం. ఇక్కడి బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపు కోసం అందరం కలిసి పని చేస్తున్నాం.
– ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి

ఓటింగ్ యంత్రాల కేటాయింపు

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



పాల్గొన్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, అధికారులు

ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని రెండు నియోజకవర్గాలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు కేటాయించనున్నట్లు కలెక్టర్ హేమంత్ బోర్కడే తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఆర్డీవో సురేశ్‌తో కలిసి శాసనసభ ఎన్నికల్లో భాగంగా మొదటి రాండమైజేషన్ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలకు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు కేటాయిస్తామని తెలిపారు. 25 శాతం బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, 40 శాతం వీవీ ప్యాట్లు రిజర్వ్‌లో ఉంచుతామని పేర్కొన్నారు. కేటాయింపు ప్రక్రియ మొత్తం వీడియో చిత్రీకరణ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అధికార దుర్వినియోగం

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

చింతలమానెపల్లి(సిర్పూర్): పోలీసు యంత్రాంగాన్ని కేసీఆర్ తన కనుసన్నల్లో ఉంచుకుని, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని కొత్తగూడెం, సోమిని, కోయపల్లి, గూడెం, దిందా, మోగలపల్లి, శివంపల్లిలో గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీలో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ నేతలు ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని ఆరోపించారు. సిర్పూర్ ప్రాంతంలోని వాగులపై వంతెనలు నిర్మించడం, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎమ్మెల్యే కోనప్ప కుటుంబం ఆగడాలు, గుండాయిజం, దౌర్జన్యాలకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ రాష్ట్ర కార్యదర్శి అర్షద్ హుస్సేన్, నాయకులు రాజన్న, చిన్నన్న, సిడాం జ్యోతి, విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలి

కెరమెరి(ఆసిఫాబాద్): వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఓపీ మరింత పెంచాలన్నారు. రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు పెరిగేలా ప్రోత్సహించాలన్నారు. ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలు బాధ్యత తీసుకుని గర్భిణులకు వైద్యపరీక్షలు చేయించాలని సూచించారు. వాతావరణ మార్పులతో వచ్చే వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి వినోద్‌కుమార్, హెచ్‌ఈ రషీద్, సబ్ యూనిట్ అధికారి శ్యాంలాల్, ఫార్మసిస్ట్ ఖలీల్ హుస్సేనీ పాల్గొన్నారు.

వీరులకు వందనం

- నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం
- 57మంది ముఖచిత్రాలతో నూతన స్తూపం ఏర్పాటు
- నివాళులర్పించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి



ఆదిలాబాద్‌లోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్మించిన స్తూపం

ఆదిలాబాద్‌టౌన్: పోలీసుల త్యాగం అజరామరం. వారి సేవలు చిరస్మరణీయం. మొక్కవోని ధైర్యసాహసాలకు ఎంతో స్ఫూర్తిదాయకం. సమాజంలో శాంతిభద్రతలను కాపాడటంతో పాటు తమ ప్రాణాలనూ లెక్క చేయకుండా ప్రజల మాన, ప్రాణాలకు రక్షణగా నిలుస్తూ వారు అందించే సేవలు అనిర్వచనీయం. 'జాతీయ చిహ్నంలోని మూడు సింహాలు చట్టానికి, న్యాయానికి, ధర్మానికి ప్రతీకలైతే.. కనిపించని నాలుగో సింహమే పోలీస్' అనే సినీ డైలాగ్ పోలీసుల విధ్యుధర్మానికి ప్రతీకగా నిలుస్తోంది. పలు ఘటనల్లో అమరులైన పోలీసుల త్యాగాలను స్మరించుకునేలా పోలీస్‌శాఖ ఏటా అక్టోబర్ 21వ తేదీన అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగానే శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించనున్న అమరవీరుల సంస్మరణ దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కొత్తగా 57మంది అమరుల ఫొటోలతో కూడిన స్తూపాన్ని ఏర్పాటు చేశారు.

సీఆర్పీఎఫ్ జవాన్ల స్మారకార్థమే..
1959 అక్టోబర్ 21న లడక్ సరిహద్దుల్లో కాపలా కాస్తున్న 10 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు చైనా సైనికులతో వీరోచితంగా పోరాడి ప్రాణత్యాగం చేశారు. వీరి స్మారకార్థంగా ఏటా అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకోవాలని 1960 జనవరిలో జరిగిన రాష్ట్రాల పోలీసు ఇన్‌స్పెక్టర్ జనరల్ సమావేశంలో నిర్ణయించారు. అప్పటినుంచి విధి నిర్వహణలో అమరులైన వారిని స్మరిస్తూ సంస్మరణ దినం నిర్వహిస్తున్నారు.

పోలీసు అమరులు వీరే..
పి.చక్రపాణి(సీఐ), ఎస్సైలు సీహెచ్.లక్ష్మణ్‌రావు, టి.రాజన్న, బి.కోట్యానాయక్, అహ్మద్ షరీఫ్, ఎస్.మల్లేశ్, సయ్యద్ ఖాదీర్ ఉల్‌హక్, సీహెచ్.మధన్ మోహన్ (ఏఎస్సై), హెడ్ కానిస్టేబుళ్లు ఎం.లక్ష్మణ్, ఎంఏ గఫార్, ఎండీ జాహురొద్దీన్, ఎంఏ జలీల్, ఎస్కే హైదేర్, తాహెర్ మహ్మద్, ఎ.గోవర్ధన్, సయ్యద్ హమీదొద్దీన్, జానారావు, ఎ.సంజీవ రెడ్డి, జి.శేషయ్య, కానిస్టేబుళ్లు ఎస్ఎస్.చారి, అశోక్ రావు, కె.జగన్నాథ్‌రావ్, విఠల్‌సింగ్, జె.ముకుంద్ రావ్, పి.రఘునాథ్, ఎంఏ జావిద్, జి.బాపురావ్, వేణుగోపాల్, బోజరాం, మోహన్‌దాస్, గణపతి, సాగిర్ అహ్మద్, కె.అశోక్, జె.సతీశ్‌బాబు, మంగీలాల్, సి.రామారావు, అంకమ్‌రావు, ఆర్.కబీర్ దాస్, ఎం.గోవింద్‌రావ్, ఆర్.శంకర్, ఆర్.ఓంకార్, కె.సుభాష్, శివశంకర్, కె.రాజేశ్వర్, పూనమ్‌చంద్, ఆర్.నర్సయ్య, ఎ.భీంరావ్.

అమరుల త్యాగాలకు గుర్తుగా..
- సీఐ చక్రపాణి జ్ఞాపకార్థం జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో చక్రపాణి మెమోరియల్ హాల్ నిర్మించారు.
- 1987 ఆగస్టు 18న అల్లంపెల్లి ఘటనకు గుర్తుగా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో అల్లంపెల్లి కాంప్లెక్స్ నిర్మించారు.
- బెల్లంపల్లి పాతబస్తీ ఘటనలో అసువులు బాసిన హెడ్‌కానిస్టేబుళ్లు సంజీవ్‌కుమార్, శేషు జ్ఞాపకార్థం పోలీసు వ్యాయామశాల ఏర్పాటు చేశారు.
- ఉట్నూర్ కొమ్ముగూడెం ఘటనలో మరణించిన ఎస్సై బీ కోట్యనాయక్ స్మారకార్థం చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటు చేశారు.
- ఖానాపూర్ పోలీసుస్టేషన్‌లో ఎస్సై మల్లేశ్ జ్ఞాపకార్థం స్తూపం నిర్మించారు.

సంఘటనలు ఇవీ..

- 1987 ఆగస్టు 18న కడెం మండలం అల్లంపెల్లిలో జరిగిన మొదటి ఎన్‌కౌంటర్‌లో నక్సలైట్ల దాడిలో ఇద్దరు ఎస్సైలు, 10 మంది కానిస్టేబుళ్లు అమరులయ్యారు.
- 1989 ఫిబ్రవరి 1న ఖానాపూర్-కడెం మండలాల్లోని సింగాపూర్ అడవుల్లో పోలీసు జీపును మందుపాతరతో పేల్చివేసిన ఘటనలో ఒక ఎస్సై, ఏడుగురు పోలీసులు మరణించారు.
- 1991 మే17న ఉట్నూర్‌లోని కొమ్ముగూడెంలో జరిగిన ఘటనలో ఎస్సై కోట్యనాయక్, ఇద్దరు పోలీసులు మరణించారు.
- 1996 జూన్ 23న సీసీసీ నస్పూర్ కాలనీలోని ఓ ఇంట్లో నక్సలైట్లు ఉన్న సమాచారం తెలుసుకున్న శ్రీరాంపూర్ సీఐ చక్రపాణి, కానిస్టేబుల్ అశోక్ అక్కడికి వెళ్లడంతో నక్సలైట్లు జరిపిన కాల్పుల్లో వీరిద్దరూ మరణించారు.
- 1996 నవంబర్ 15న సిర్పూర్(యూ) పోలీసు స్టేషన్ పేల్చివేసిన ఘటనలో ఎస్సై అహ్మద్ షరీఫ్‌తో పాటు 12మంది పోలీసులు చనిపోయారు.
- 1998 మే 28న బెల్లంపల్లి పాతబస్తీ దగ్గర సికాస (సింగరేణి కార్మిక సమాఖ్య) పోలీసులకు మధ్య జరిగిన కాల్పుల్లో హెడ్ కానిస్టేబుళ్లు సంజీవ్‌కుమార్, శేషు మరణించారు.
- 1999 డిసెంబర్ 2న ఖానాపూర్ మండలం తార్లపాడు వద్ద మావోయిస్టులు మందుపాతర పేల్చడంతో ఖానాపూర్ ఎస్సై సింగం మల్లేశ్, కానిస్టేబుల్ పున్నంచంద్ అమరులయ్యారు.

క్లుప్తంగా

ఇంటి పెరటిలో గంజాయి మొక్కల పెంపకం


గంజాయి మొక్కల వద్ద పోలీసులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ నంబర్–2 ఇంక్‌లైన్ బస్తీలో ఓ వ్యక్తి సాగు చేసిన గంజాయి మొక్కలను టూటౌన్ పోలీసులు గుర్తించారు. కుమ్మరి లింగయ్య ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలను పెంచుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం రావడంతో శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీంతో గంజాయి మొక్కలు కనిపించాయి. వాటిని స్వాధీనం చేసుకోగా నిందితుడు లింగయ్య పారిపోయాడు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్, టూటౌన్ పోలీసులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌హెచ్‌వో

బెల్లంపల్లి: బెల్లంపల్లి అంబేద్కర్‌నగర్ బస్తీలో శుక్రవారం గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ బస్సిలాల్ తెలిపిన వివరాల ప్రకారం. బస్తీలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా శ్మశాన వాటిక ప్రాంతంలో బూడిద గడ్డబస్తీకి చెందిన బెండేటి రాజు, రవీంద్రనగర్ బస్తీ వాసి బూర్లసాయిలను సోదా చేయగా 130 గ్రాముల గంజాయి లభించింది. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా బల్లార్షా నుంచి కొనుగోలు చేసి బెల్లంపల్లి ప్రాంతంలో విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.లక్ష సీజ్

బెల్లంపల్లి పాత బస్టాండ్ వద్ద ఓ వ్యక్తి వద్ద నుంచి రూ.లక్ష స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌ఓ బస్సిలాల్ తెలిపారు. వాహనాల తనిఖీ చేస్తుండగా బూడిదగడ్డ బస్తీకి చెందిన సాగల యాదగిరి వద్ద నగదు లభించాయని తెలిపారు. ఎలాంటి ఆధారాలు లభించలేదని, డబ్బును ఎన్నికల ఎఫ్‌ఎస్‌టీ అధికారులకు అప్పగించగా సీజ్ చేశారు.

పాలస్తీనాపై ఇజ్రాయెల్ సైనికదాడులు ఆపాలి


ర్యాలీలో నాయకులు

పాతమంచిర్యాల: పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న సైనిక దాడులు ఆపాలని, పాలస్తీనా భూభాగం నుంచి వైదొలగాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను నిరసిస్తూ నిరసన ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇజ్రాయెల్ అమెరికా అండదండలతోనే పాలస్తీనాపై దాడులు చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి లాల్‌కుమార్, నాయకులు రత్నం తిరుపతి, ఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి బ్రహ్మానందం, పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ, నాయకురాలు ఓదెమ్మ, ఐఎఫ్‌టీయూ నాయకులు తోకల తిరుపతి, అరుణోదయ సమితి రాష్ట్ర కోశాధికారి వి.మల్లన్న, నాయకులు పోతుల కిష్టయ్య, మనోహర్ పాల్గొన్నారు.

స్వతంత్రుల సత్తా..

- ఉమ్మడి జిల్లా నుంచి తొమ్మిది మంది స్వతంత్ర అభ్యర్థులు
- పెద్ద పార్టీల అభ్యర్థులను తట్టుకుని ఎన్నికల్లో విజయం
- ప్రజల మద్దతుతో ఎన్నికల్లో సులభంగా గెలుపు



మంచిర్యాలటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పలుమార్లు ఎన్నికల్లో ప్రజలు స్వతంత్ర అభ్యర్థులకు పట్టం కట్టారు. పార్టీలకు అతీతంగా కేవలం అభ్యర్థులపై ఉన్న నమ్మకం, వారితోనే తమ అభివృద్ధి ఉంటుందని ఆశించి ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో తొమ్మిది మందిని జిల్లా ప్రజలు గెలిపించుకున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో ముగ్గురు, నిర్మల్ జిల్లాలో ముగ్గురు, మంచిర్యాల జిల్లాలో ఇద్దరు, కుమురంభీం జిల్లా నుంచి ఒక్కరు మొత్తం తొమ్మిది మంది స్వతంత్ర అభ్యర్థులు వారి సత్తా చాటి ఎన్నికల్లో ప్రజల అశీర్వాదం పొందారు.

కొమురంభీం జిల్లాలో సిర్పూరు నుంచి ఒక్కరు


పురుషోత్తం

కొమురంభీం జిల్లాలోని సిర్పూర్ నియోజకవర్గం నుంచి పాల్వాయి పురుషోత్తం రావు రెండు సార్లు సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొంది సత్తా చాటారు. 1989, 1994లో టీడీపీ అభ్యర్థి కేవీ నారాయణరావుపై స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన పురుషోత్తం రావు గెలుపొందారు. పాల్వాయి పురుషోత్తంరావు బెజ్జూరు మండలంలోని రెబ్బెన గ్రామపంచాయతీలో ఉపసర్పంచ్‌గా, సింగిల్ విండో చైర్మన్‌గా, ఎంపీపీగా తన రాజకీయాన్ని ప్రారంభించి, ఆ తరువాత స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఎమ్మెల్యే ఎన్నికల్లో గెలుపొందారు. రాజకీయాల్లో తనదైన శైలిలో ముద్రవేశారు. 1989లో టీడీపీ నుంచి టికెట్ ఆశించినా కేవి నారాయణ రావుకు దక్కడం, 1994లో కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశించగా కేశవులకు టికెట్ దక్కడంతోనే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు.

ఆదిలాబాద్ జిల్లా నుంచి ముగ్గురు


సి. రాంచంద్రారెడ్డి


సి. వామన్ రెడ్డి

ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు గెలుపొంది అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటారు. 1962–67లో విఠల్‌రావు దేశ్‌పాండే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి 13,949 ఓట్లు సా ధించగా ప్రత్యర్థిగా పోటీ చేసిన కె. రాంకిష్టు సీపీఐ నుంచి పోటీ చేసి 12,895 ఓట్లు సాధించారు. అనంతరం 1978–83, 1985–89లలో సి.రాంచంద్రారెడ్డి, 1983–85లలో సి.వామన్‌రెడ్డిలు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసి గెలుపొందారు.

మంచిర్యాల జిల్లాలో ఇద్దరు.. లక్సెట్టిపేట్‌లో ఇద్దరు గెలుపు


జివి పితాంబర్‌రావు


జివి సుధాకర్‌రావు

ప్రస్తుత మంచిర్యాల అప్పటి లక్సెట్టిపేట్ నియోజకవర్గం నుంచి ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. జీవీ పితాంబర్‌రావు 1962–67లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. జివి పితంబర్ రావుకు 24,027 ఓట్లు రాగా, కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన ప్రత్యర్థి అభ్యర్థి జీవీ నర్సింగరావుకు 20,153 ఓట్లు వచ్చాయి. 1985లో జివి సుధాకర్‌రావు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయగా, 43,140 ఓట్లు సాధించాడు. ప్రత్యర్థి అభ్యర్థి టీడీపీ పార్టీకి చెందిన సి.కృపాకర్‌కు 27,921 ఓట్లు రాగా జీవీ సుధాకర్ రావు గెలుపొందారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన 1989లో కాంగ్రెస్ నుంచి మరోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

నిర్మల్ జిల్లాలో ముగ్గురు


గోవింద్ నాయక్


గడ్డిగారి గడ్డెన్న


కొరిపెల్లి ముత్యంరెడ్డి

నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్, ముథోల్, నిర్మల్ నియోజకవర్గాల నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసి పలువురు సత్తా చాటారు.

- ఖానాపూర్ నియోజకవర్గానికి 1985లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి జాలం సింగ్‌పై స్వంతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన గోవింద్ నాయక్ గెలుపొందారు. గోవింద్ నాయక్‌కు 22,014 ఓట్లు రాగా, బానోతు జాలం సింగ్‌కు 13,512 ఓట్లు వచ్చాయి. ఆ తరువాత గోవింద్ నాయక్ టీడీపీలో చేరారు.
- ముథోల్ నియోజకవర్గంలో 1967లో గడ్డిగారి గడ్డెన్న 1967, 1972లో రెండుసార్లు స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. 1967లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన గడ్డెన్నకు 34,610 ఓట్లు రాగా కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన జీజీ రెడ్డికి 11,701 ఓట్లు వచ్చాయి. 1972లో మాత్రం గడ్డెన్న స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసినా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
- నిర్మల్ నియోజకవర్గం నుంచి తొలి ఎమ్మెల్యే కొరిపెల్లి ముత్యంరెడ్డి 1957 స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆర్ దేశ్‌పాండే అనే కాంగ్రెస్ అభ్యర్థిపై గెలుపొందారు.

రూ.1.52లక్షలు పట్టివేత


నగదు అధికారికి అందిస్తున్న పోలీసులు

బెల్లంపల్లిరూరల్: ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉండడంతో ఎన్నికల అధికారులు, పోలీసులు విస్తృత తనిఖీలు చేస్తున్నారు. శుక్రవారం బెల్లంపల్లి మండలం లంబాడతండాలోని పెట్రోల్‌బంక్ సమీపంలో రూ.1,52000 నగదును తాళ్లగురిజాల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వేమనపల్లి మండలం నాగారంకు చెందిన ఎర్రయ్య వద్ద నుంచి రూ.52000, భీమిని మండలానికి చెందిన దర్శన్ వద్ద నుంచి రూ.లక్ష నగదును పత్రాలు లేకుండా బెల్లంపల్లికి తరలిస్తుండగా జప్తు చేసి ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ (ఎఫ్‌ఎస్‌టీ) శ్రీధర్‌కు అందజేయగా సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో తాళ్లగురిజాల ఎస్సై నరేష్, ఏఎస్సైలు లింగన్న, మజారుద్దిన్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

వాంకిడి: మండలంలోని ఇందాని ఎక్స్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఇద్దరు వ్యక్తుల వద్ద రూ.1.15 లక్షల నగదు పట్టుకున్నట్లు ఎస్సై డి.సాగర్ తెలిపారు. ఆధారిత పత్రాలు లేకపోవడంతో పట్టుబడిన నగదును సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

చింతలమానెపల్లి: మండలంలోని గూడెం చెక్‌పోస్ట్ శుక్రవారం వద్ద రూ.1,50,000 నగదును పట్టుకున్నట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. అహేరి నుండి గూడెం వైపు వస్తున్న తరుణ్ ఆహుజా వద్ద నగదుకు సంబంధించిన సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశామని తెలిపారు. ఆయన వెంట పోలీసులు ఉన్నారు.

గుడుంబా పట్టివేత

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని బాబాపూర్ గ్రామంలో గుడుంబాను పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ మోషిన్ అలీ తెలిపాడు. ఆయన వివరాల ప్రకారం .. ముందస్తు సమాచారం మేరకు దాడులు చేసి రూ.49702 విలువ గల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. 400 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. మద్యం విక్రయించినా, గుడుంబా తయారు చేసిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్సై విజయలక్ష్మి, హెడ్‌కానిస్టేబుల్ ధర్మ ప్రకాష్, సిబ్బంది మహేష్, సురేష్, కిరణ్ ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణకు పార్లమెంటులో బిల్లు పెట్టాలి


జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశంలో మందకృష్ణ మాదిగ

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

కాగజ్‌నగర్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు ఇచ్చిన హామిని విస్మరించిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. శుక్రవారం రాత్రి కాగజ్‌నగర్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బీజేపీతో పాటు బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తున్నాయి కానీ చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదన్నారు. నవంబర్ చివరిలో హైదరాబాద్ కేంద్రంగా మాదిగల విశ్వరూప మహాసభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మాదిగల విశ్వరూప రథయాత్రను ఆదిలాబాద్ నుంచి ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

మత్తుమందు స్ప్రే చేసి చోరీ

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ఆంధ్రాకాలనీలో దొంగతనం జరిగినట్లు ఎస్సై లక్ష్మణ్ శుక్రవారం తెలిపారు. వివరాల ప్రకారం... గురువారం రాత్రి కాలనీకి చెందిన పెండ్యాల రాజేశ్వర్‌రావు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కిటికిలోనుంచి మత్తు స్ప్రే చేసి ఇంట్లోకి చొరబడి 27తులాల బంగారం, రూ.85వేల నగదు ఎత్తుకెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

కాసిపేట 2గనిపై చండీయాగం


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట– 2గనిపై శుక్రవారం దసరా నవరాత్రులు పురస్కరించుకుని చండీయాగం, హోమం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలే నిర్వహించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, మాజీ ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు, సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి రేగుంట చంద్రశేఖర్ హాజరై పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ ఏజెంటు రాందాస్, గని మేనేజర్ లక్ష్మినారాయణ, టీబీజీకేఎస్ ఫిట్ కార్యదర్శి కారుకూరి తిరుపతి, రక్షణాధికారి సంతోష్‌రావు, సంక్షేమాధికారి భార్గవ్ పాల్గొన్నారు.

బంగారు మైసమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి శివారు కన్నాల జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న బంగారు మైసమ్మ ఆలయంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయంలో మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత


పట్టుబడిన మద్యంతో పోలీసులు

లక్సెట్టిపేట: మండలంలోని పలు గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ బాబా తెలిపారు. వివరాల ప్రకారం... లక్ష్మీపూర్, మిట్టపల్లి, సురారం గ్రామాల్లో మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు నిర్వహించి భాగ్య, లక్ష్మి, లావణ్యలను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ.17వేలు ఉంటుందన్నారు. అలాగే స్కూటీలో మద్యం తరలిస్తుండగా పట్టుకుని వాహనాన్ని సీజ్ చేశారు. ఈ దాడిలో ఎస్సై రాబర్ట్ పాల్గన్నారు.

వాంకిడి: ఎన్నికల్లో భాగంగా మండలంలోని బోర్దా గ్రామంలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం పట్టుకున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు. బోర్దా గ్రామానికి చెందిన బెల్ట్‌షాప్ నిర్వాహకుడు నికురే భీంరావు వద్ద రూ.2500 విలువ గల మద్యం పట్టుకుని సీజ్ చేశారు. అక్రమంగా మద్యం విక్రయాలు చేపడితే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించాడు.

జనసంద్రమైన 'అమ్మ' పుణ్యక్షేత్రం


జంగుబాయి దర్శనానికి బారులు తీరిన భక్తులు


తోఫ్లకసకు పూజలు చేస్తున్న ఆదివాసీలు


సంప్రదాయ నృత్యాలు చేస్తున్న మహిళలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

- భారీగా తరలివచ్చిన ఆదివాసీలు
- సంప్రదాయ పద్ధతిలో ముందస్తు దసరా పర్వదినం

కెరమెరి(ఆసిఫాబాద్): తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లోని కెరమెరి మండలం మహరాజ్ గూడ అడవుల్లో బస చేసిన ఆదివాసీ ఇలవేల్పు జంగుబాయి పుణ్యక్షేత్రం గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం వరకూ జనసంద్రంగా మారింది. కటోడా రాయిసిడాం జంగు ఆధ్వర్యంలో నాలుగు రోజులు ముందస్తు దసరా ఉత్సవాన్ని అమ్మవారి సన్నిధిలో నిర్వహించారు. ఎనిమిది గోత్రాలకు చెందిన ఆది వాసీలు పాల్గొన్నారు. రాష్ట్రంలోని నలు మూలల నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి


ఆత్రం సత్యం మృతదేహం

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సండ్రోన్‌పల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతిచెందాడు. ఎస్సై చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇటుక బట్టీల నిర్వాహకుల వద్ద ఆత్రం సత్యం(45) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తాడు. గురువారం రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో సండ్రోన్‌పల్లి గ్రామంలో ట్రాక్టర్ అదుపుతప్పింది. విద్యుత్ స్తంభానికి ఢీకొని పక్కనే ఉన్న పత్తి చేనులోకి దూసుకెళ్లింది. డ్రైవర్ కింద పడి తీవ్ర గాయాలు కావడంతో మృతిచెందాడు. సత్యం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా మృతదేహం లభించింది. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య కమల, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

క్రీడా నైపుణ్యం పెంపొందించుకోవాలి

- సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణ


బహుమతులతో క్రీడాకారులు

శ్రీరాంపూర్: క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సింగరేణి కంపెనీ డైరెక్టర్ (ఈఅండ్ఎం) ఎస్.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో నిర్వహించిన సింగరేణి హాకీ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాజమాన్యం అందిస్తున్న సదుపాయాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకుని రాణించాలని తెలిపారు. పోటీల్లో కొత్తగూడెం కార్పొరేట్ జట్టు ప్రథమ, శ్రీరాంపూర్ ఏరియా జట్టు ద్వితీయ స్థానాల్లో నిలువగా డైరెక్టర్ బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం సంజీవరెడ్డి, డీజీఎం(పర్సనల్) అరవింద రావు, ఏజెంట్ ఏవీ రెడ్డి, సీనియర్ సెక్యూరిటీ అధికారి మురళీమోహన్, స్పోర్ట్స్ సెక్రెటరీ పాలకుర్తి రాజు, ఇంచార్జి స్పోర్ట్స్ మేనేజర్ జాన్ వెస్లీ ఉన్నారు.

గనులపై నవరాత్రి ఉత్సవాలు

శ్రీరాంపూర్: ఏరియా వర్క్‌షాప్‌లోని దుర్గామాత ఆలయంలో జరిగిన చండీయాగంలో కంపెనీ డైరెక్టర్(ఈఅండ్ఎం) ఎస్.సత్యనారాయణ, ఏరియా జీఎం బీ.సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఆర్కే 5 గనిపై నవరాత్రి ఉత్సవాల్లో అన్నదానం నిర్వహిచారు. గని మేనేజర్ అబ్దుల్‌ఖాదీర్ పాల్గొన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీలో నిర్వహించిన నవరాత్రి ఉత్సవాల్లో జీఎం, పీఓ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని శివాలయం, పద్మశాలి భవనం, పాత బస్టాండ్ ముదిరాజ్ కాలనీ, కొత్తగూడెం కొండపోచమ్మ ఆలయం, బట్టిగూడెం లక్ష్మీదేవర ఆలయాల వద్ద సద్దుల బతుకమ్మ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయాల వద్ద మహిళలు పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. మహిళలు మాట్లాడుతూ చెన్నూర్ పట్టణంలో అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం ఏడు రోజుల్లోనే బ్రాహ్మణ, పద్మశాలి, ముదిరాజ్ కులానికి చెందిన మహిళలు సద్దుల బతుకమ్మ వేడుకలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. అనంతరం పెద్ద చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


చెన్నూర్ పట్టణంలోని బట్టిగూడెంకాలనీలో సద్దుల బతుకమ్మ ఆడుతున్న మహిళలు


చెన్నూర్ పద్మశాలి భవనంలో..


బతుకమ్మను తీసుకెళ్తున్న మహిళ